క్లుప్తంగా

రికార్డులు లేకుంటే చర్యలు తప్పవు

యాదమరి: మండల పరిధిలో వాహనాలు నడిపేవారు రికార్డులు లేకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ సుమన్ హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. పలు వాహనాలకు రికార్డులు సక్రమంగా లేకపోవడంతో కేసులు నమోదు చేసి అపరాధ రుసుం వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలని చెప్పారు. రికార్డులు సక్రమంగా లేకున్నా, మైనర్లు నడిపినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న సిబ్బంది

గుడిపాల: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ అన్నారు. మండలంలోని పెరుమాళ్లకుప్పం, మందిక్రిష్ణాపురం రైతుభరోసా కేంద్ర పరిధిలోని గ్రామాల్లో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులంతా తమ దగ్గరవున్న పశువులకు తప్పనిసరిగా నివారణ టీకాలు ముందస్తుగా వేయించాలని తెలిపారు. ఆయనతో పాటు సిబ్బంది మాధవరెడ్డి, కిషోర్ ఉన్నారు.

వినియోగదారుల సమస్యలను పరిష్కరిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ శంకరన్

చిత్తూరు రూరల్: వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని డీఎస్‌ఓ శంకరన్ పిలుపునిచ్చారు. నగరం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బుధవారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. వస్తువుల క్రయ విక్రయాల్లోని లోపాలను గుర్తించాలన్నారు. వాటిని గుర్తించాలంటే ముందుగా ప్రజలకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. వచ్చే సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ శేషచలరాజు, తూనికల కొలతల అధికారులు పాల్గొన్నారు.


పంట నమోదు వివరాలు సరి చూసుకోండి

గుడిపాల: మండలంలోని ప్రతి రైతు భరోసా కేంద్రంలోనూ రబీ కింద సాగుచేసిన పంట వివరాలు నమోదు జాబితాలను ప్రదర్శించామని, రైతులు వాటిని సరిచూసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. మండలంలోని నారగల్లు, 197రామాపురం, కమ్మతిమ్మాపల్లె, మరకాలకుప్పం, నంగమంగళం, బొమ్మసముద్రం, పానాటూరు, వసంతాపురం, బసవాపల్లె, పేయనపల్లె, రామభద్రాపురం, 189కొత్తపల్లె, గుడిపాల, పాపసముద్రం, చిత్తపార సచివాలయాల్లో జాబితాలు ప్రదర్శించామన్నారు. రైతులు సాగుచేసిన పంట వివరాలు, సర్వేనెంబర్లు, ఆధార్‌నంబర్లు తప్పుగా ఉన్నా వాటిని సరి చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం


పాలేటమ్మ విగ్రహం

ఐరాల: మండల కేంద్రంలో శ్రీ పాలేటమ్మ ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవాలు నేటి నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ వంశపార్యంపర్య ధర్మకర్త ఎం.కే.బాలాజి తెలిపారు. గురువారం ఉదయం కలశ స్థాపన, సాయంత్రం యాగశాల ప్రారంభం, వాస్తు పూజ, అంకురార్పణ పూజలు, శుక్రవారం వేకువజామున 2 గంటలకు అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, ఉదయం హోమాలు, ప్రాణప్రతిష్ట, అభిషేకాలు, మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని వివరించారు.


ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన యాగశాల

కాన్వెంట్ నుంచి సర్కారు బడికి

- ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ బడులు
- సత్ఫలితాలిస్తున్న మెసేజ్ అలర్ట్
- విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ

కాన్వెంట్‌కు వెళ్లే పిల్లలు క్రమంగా సర్కారు బడి బాట పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల హాజరు పెంచేలా ప్రభుత్వం తాజాగా అమలు చేసిన మొబైల్ అలర్ట్ సందేశం విధానానికి మంచి స్పందన లభిస్తుంది. దీంతోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సంక్షేమ పథకాలతోపాటు, సకల సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తోంది. అత్యాధునిక వసతులతో ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దింది. ప్రభుత్వ ఉపాధ్యాయుల పనితీరు మరింత మెరుగుపడింది.


పాఠశాలలోని విద్యార్థులు

గుడిపాల: మండలంలో నాడు–నేడుతో ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని సమకూర్చి మెనూ ప్రకారం రోజూ మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి బైజూస్ కంటెంట్‌తో బోధన ప్రారంభించింది. తాజాగా విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా? లేదా అన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోతే తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం పంపేలా చర్యలు తీసుకుంది.

పాఠశాలలకు డుమ్మా కొట్టే విద్యార్థులకు ఇక చెక్ పెట్టినట్లే. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ అలర్ట్ సందేశంతో తల్లిదండ్రులు పిల్లలను గాడిలో పెడుతున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో 127 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 11,599 మంది విద్యార్థులున్నారు. ఈ విద్యార్థులంతా వంద శాతం హాజరై తద్వారా అమ్మ ఒడి పథకాన్ని అందుకోవాలన్న ఉద్దేశంతో ఈ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి డుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భంలో విద్యార్థి పాఠశాలకు హాజరు కాలేదంటూ వారి తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం వెళుతుంది. ప్రభుత్వం కొత్తగా అమలుచేసిన ఈ విధానంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సమయం దాటినా రాకుంటే...

విద్యార్థులు ఉదయం 10:30 గంటల్లోపు పాఠశాలలకు హాజరు కాకపోతే మీ అమ్మాయి/అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరు కాలేదంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరుతో ఆయా తల్లిదండ్రులకు నేరుగా మొబైల్‌కు సందేశం చేరుతుంది. దీనికోసం ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి మొబైల్, ఆధార్ నెంబర్‌ను సేకరించి సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వరుసగా మూడురోజులపాటు పాఠశాలకు హాజరుగాకపోతే తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంత గ్రామ వలంటీర్, సచివాలయ సహాయకుడికి ఈ మెసేజ్ చేరుతుంది. దీంతో వలంటీర్ వెల్ఫేర్ అసిస్టెంట్ హెచ్‌ఎంతో కలిసి విద్యార్థి ఇంటికి వెళ్లి పాఠశాలకు ఎందుకు రావడం లేదన విషయాన్ని అడిగి తెలుసుకుంటారు. ఈ కారణంగా బడిబయట విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. దీంతోపాటు మండల వ్యాప్తంగా ప్రైవేట్ కాన్వెంట్లకు వెళ్లే పిల్లలు క్రమంగా ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం ఇంకా పూర్తవకముందే, ఈ నెలలోనే సుమారు 80 మంది అడ్మిషన్ తీసుకున్నట్లు ఉపాధ్యాయు చెబుతున్నారు. వీరిలో బడి బయట పిల్లలు కూడా 25 మంది వరకు ఉన్నారని వివరించారు.

చాలా మంచి విధానం



విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం చేరవేసే విధానం ఎంతో మంచిది. దీనివల్ల పాఠశాలల్లో వంద శాతం హాజరు అమలవుతోంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా ఉంటే తల్లిదండ్రులకు వెంటనే తెలుస్తోంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగకరం. విద్యార్థులు, విద్యపై శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం పట్ల ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

– రమేష్, పేరెంట్స్ కమిటీ మెంబర్

వెంటనే సమాచారం



విద్యార్థులు పాఠశాలకు రాకపోతే వారి తల్లిదండ్రులకు సమాచారం వెంటనే అందుతుంది. దీనివల్ల ప్రతి ఒక్కరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా విద్యార్థినుల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండేందుకు వీలవుతుంది. విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం ఉండదు. అటు ప్రభుత్వం కూడా ఎప్పటికప్పుడు విద్యార్థుల హాజరు, పాఠశాలకు రాకపోవడం వంటి అంశాలపై దృష్టి పెట్టింది.

– సబర్‌మతి, ప్రధానోపాధ్యాయులు, నరహరిపేట

పూర్తిస్థాయిలో హాజరు శాతం



ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేస్తోంది. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం వెళ్లే కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. దీనివల్ల హాజరుశాతం మెరుగవుతుంది. విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రాలేదో వెంటనే తెలుస్తోంది. బడిబయట పిల్లలు మళ్లీ బడికి వస్తున్నారు. కాన్వెంట్‌కు వెళ్లే పిల్లలు ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు.

– రామ్‌నాయక్, మండల విద్యాశాఖాధికారి, గుడిపాల

బాలింతలు రక్త పరీక్షలు చేయించుకోవాలి


సబ్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కో–ఆర్డినేటర్ గాంధీ

పూతలపట్టు: రక్తహీనతతో బాధపడే బాలింతలు క్రమం తప్పకుండా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని ఎస్‌బీసీసీ జిల్లా కో–ఆర్డినేటర్ గాంధీ అన్నారు. కలెక్టర్, డీఆర్‌ఓ ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని తలపులపల్లి సబ్‌సెంటర్, ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కౌమార బాలికలను గుర్తించి వారికి ప్రత్యేకంగా హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించాలని ఏఎన్‌ఎంలకు తెలిపారు. న్యూట్రీషన్ ఫుడ్, దిశ చట్టాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీల్లో బాలింతలకు వైఎస్సార్ కిట్ తప్పనిసరిగా అందాలని కార్యకర్తలకు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్టుమెంట్లు అన్నీ ఖాళీగా ఉన్నాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 63,285 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 22,487 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.60 కోట్లు భక్తులు సమర్పించారు. టికెట్లు లేని వారికి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన వారు 2 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


గుడిపాల: పరీక్ష కేంద్రం వద్ద బందోబస్త్‌లో సీఐ, తహసీల్దార్,


పూతలపట్టు: పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఇందులో 213 మంది విద్యార్థులకు గాను 204 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్త్ నిర్వహించారు. తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసరెడ్డి పరీక్ష కేంద్రాల ఆవరణలోకి ఎవరూ రాకుండా గట్టి బందోబస్త్ నిర్వహించారు.

మాస్ కాపీయింగ్ వద్దు

పూతలపట్టు: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు చూచిరాతకు అవకాశం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో గౌరీ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 108 మందికి గాను 103 మంది హాజరయ్యారని ఎగ్జామినర్ సత్యనారాయణ పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఎంపీడీఓ గౌరి పరిశీలించారు. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో అన్నిరకాల వసతులను కల్పించాలని స్పష్టం చేశారు.

కార్మికుల ఆరోగ్యానికి ప్రాధాన్యత


వైద్య శిబిరంలో మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్

చిత్తూరు అర్బన్: పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ ఎస్.అముద, కమిషనర్ జె.అరుణ చెప్పారు. నగర పాలక సంస్థ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో సీఎంసీ ఆస్పత్రి వైద్యులు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మేయర్, కమిషనర్‌తోపాటు డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి సందర్శించారు. కార్మికులకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేయాలని సూచించారు. మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు ప్రాథమిక వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికులు పాత్ర ఎనలేనిదన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సీఎంసీ వైద్యుల ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనిక్, డెంటల్, ఈఎన్టీ, ఆప్తమాలజీ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఈ శిబిరంలో 320 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు అనంతరం వీరికి అవసరమైన మాత్రలు, మందులు అందించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

భక్తజన పరవశం


పుంగనూరు ప్యాలెస్ ఆవరణలో భక్తజనం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పుంగనూరు: జమీందారుల కులదైవమైన సుగుటూరు గంగమ్మ జాతర రెండు రోజుల పాటు పట్టణంతోపాటు గ్రామాల్లోనూ కోలాహలంగా సాగింది. మంగళ, బుధ వారాల్లో అమ్మవారికి తొలి, మలి పూజలు జమీందారులు నిర్వహించగా బెస్తవారు, యాదవ కులస్తులు, తోటి కులస్తులచే పూజలు ఘనంగా నిర్వహించారు. అలాగే పట్టణంలోని బజారువీధిలో నడివీధి గంగమ్మ, తూర్పు మొగసాలలో గంగమ్మ, బాలాజి థియేటర్ వద్ద మలారమ్మ గంగమ్మ, మైసూర్ బ్యాంకు వద్ద నలగంగమ్మ, బస్టాండులో విరూపాక్షి మారెమ్మ, నల్లరాళ్లపల్లె వద్ద నలగంగమ్మ, కోనేరు వద్ద బోయకొండ గంగమ్మ, నానాసాహెబ్‌పేటలోని నడివీధి గంగమ్మలను ఉంచి పట్టణ ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. విరూపాక్షి మారెమ్మను పట్టణంలో పల్లకిలో కొలువుదీర్చి ఊరేగించారు.

జాతర సందడి..

రెండు రోజుల జాతర సందర్భంగా పట్టణంలో ఎటుచూసినా మేళతాళాలతో వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు గుంపులుగుంపులుగా ప్యాలెస్‌లోకి వెళ్లారు. ప్యాలెస్ ఆవరణం జనసంద్రమైంది. భక్తి గీతాలతో పట్టణంలో సందడి నెలకొంది. ఆలయం ముఖద్వారం, ప్యాలెస్‌లోను, పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాల్లోను అమ్మవారి చిత్రాలను విద్యుద్దీపాలతో తయారు చేశారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం


కలప దుంగలను జేసీబీ సాయంతో తీస్తున్న కూలీలు(ఫైల్)

బంగారుపాళెం: చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు. కొందరు అక్రమార్కులు వృక్షాలను అక్రమంగా నరికివేస్తున్నారు. చెట్లను కాపాడాలంటూ సూక్తులు చెప్పే అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. వాల్టా చట్టం ప్రకారం రైతుల సొంత పొలాల్లోని గట్లపై ఉన్న చెట్లను నరకాలన్నా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. మండలంలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెట్లను అడ్డంగా నరుకుతూ పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. చెట్లను అక్రమంగా నరికితే వాల్టా చట్టం కింద వారిపై కేసులు నమోదు చేయాలి. కానీ, ఎలాంటి అనుమతులు లేకుండా భారీ వృక్షాలను నరికి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తున్నా అటు రెవెన్యూ, ఇటు అటవీశాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. గత నెలలో మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీల పరిధిలో ఎర్రాండ్లపల్లె–జయరాంపురం రహదారి పక్కన గ్రామనత్తానికి సంబంధించిన రెండు చింత చెట్లను ఎర్రాండ్లపల్లెకు చెందిన వ్యక్తి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా చెట్లను నరికి వ్యాపారులకు విక్రయించేశారు. ఈ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపించారు. మండలంలోని తుంబపాళెం, తుంబకుప్పం, కీరమంద, కొదలమడుగు, వెలుతురుచేను, రాగిమానుపెంట అడవుల్లో వేప, ఇతర వృక్షాలను సైతం వ్యాపారులు అక్రమంగా నరికి పక్క రాష్ట్రమైన తమిళనాడుకు తరలిస్తున్నారని చెప్పారు. అయినా అటవీశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు చెబుతున్నారు. యథేచ్ఛగా చెట్లునరికి వేయడం మూలాన పర్యావరణానికి ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకల జీవరాశులకు నిలయమైన అటవుల్లో చెట్లను నరికివేస్తూ పోవడంవల్ల అడవుల్లో నివశించే జీవజాతులు అంతరించి పోతాయని అంటున్నారు.

జాడ లేని వీఆర్వోలు

మండలంలోని రెవెన్యూ గ్రామాల్లో వీఆర్‌ఓలు స్థానికంగా నివాసం ఉండకపోవడం వల్ల ఆయా గ్రామాల్లో వ్యాపారులు చెట్లను నరికి వ్యాపారం చేసుకుంటున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఆయా గ్రామాల్లో చెట్ల నరికివేతపై వీఆర్‌ఓలకు స్థానికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెట్లను అక్రమంగా నరుకుతూ పర్యావరణానికి తూట్లు పొడుస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ప్రభుత్వ స్థలాలు, రైతుల పొలాల్లో చెట్లను నరికితే నాకు ఫిర్యాదు చేయాల్సి ఉంది. నిబంధనల ప్రకారం అక్రమంగా చెట్లను నరకడం నేరం. గ్రామాల్లో అక్రమంగా చెట్లను నరుకుతున్నారని సమాచారం అందిచే చర్యలు తీసుకుంటాం. కలపను స్వాధీనం చేసుకుని వారిపై క్రిమినల్ కేసులు పెడతాం.

– బెన్నురాజ్, తహసీల్దార్ బంగారుపాళెం

గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్' సేవలు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక 115 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భవతులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు రక్తహీనత రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలకు జలుబు, దగ్గు, జ్వరం సోకితే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించి వైద్య చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్‌ఎం నవనీతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పావని, 104 సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

చిత్తపారలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

గుడిపాల: మండలంలోని చిత్తపార గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ కఠారి కుమార్ 120 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలను ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం హేమలత, సిబ్బంది సంధ్య, బిందుమతి, కోకిల పాల్గొన్నారు.


టి.పుత్తూరులో సేవలందిస్తున్న వైద్యబృందం


గుడిపాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కఠారి కుమార్

నేడు రామభద్రాపురంలో..

మండలంలోని రామభద్రాపురంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహించనున్నట్లు ప్రాథమిక వైద్యాధికారి కఠారి కుమార్ తెలిపారు. ఉదయం 9:30 గంటలకు వైద్యసేవలను ప్రారంభమవుతాయని వివరించారు. గర్భిణిలు, బీపీ, షుగర్ పేషెంట్లు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

